క్లుప్తంగా

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై భక్తుడిని అడిగి తెలుసుకుంటున్న ఆజాద్

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా గురువారం ఉత్సవాల ప్రత్యేక అధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ పలుచోట్ల పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. కైలాసద్వారం, మల్లమ్మకన్నీరు, కల్యాణకట్ట, పలుచోట్ల గల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. భీమునికొలను మెట్ల మార్గం వద్ద పాదయాత్రతో వస్తున్న పలువురు భక్తులతో సంభాషించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కైలాసద్వారం వద్ద, భీమునికొలను మెట్ల మార్గంలో నిరంతరం మంచినటి సరఫరా జరుగుతుండాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

సంగమేశ్వరం, కొలనుభారతికి ప్రత్యేక బస్సులు

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతి దేవి ఆలయాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు గురువారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 8,9 తేదీల్లో సప్తనది సంగమేశ్వరం క్షేత్రానికి 6, కొలనుభారతి క్షేత్రానికి 4 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని చెప్పారు. పండగ రోజున భక్తుల రద్దీని అనుసరించి మరిన్ని బస్సు సర్వీసులను పెంచుతామని చెప్పారు.

మల్లన్నను దర్శించుకున్న పీఠాధిపతి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న పీఠాధిపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠా ధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో పీఠాధిపతి గౌరవార్థం వేదపండితులు వేదగోష్ఠి నిర్వహించారు. అధికారులు వస్త్ర సమర్పణ చేశారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

శ్రీశైలం : క్షేత్రపరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శ్రీశైలంలోని లలిత బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల వద్ద గురువారం బాంబు స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేశారు. దుకాణాలు ముందు ఉన్న సరుకుల మూటలు, గోడౌన్లు, బస్టాండ్, టూరిస్ట్, కార్లు నిలిపే స్థలాలు కర్నూలు నుంచి వచ్చిన బాంబు స్క్వాడ్ బృందం తనిఖీలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

జూపాడుబంగ్లా: ప్రకృతి వ్యవసాయంతో లాభాలు ఆర్జించవచ్చునని ఏపీఎం అంబమ్మ, ఎస్సీ కార్పొరేషన్ సూపరింటెండెంట్ గంధర్వచారి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో లబ్ధిదారులకు డ్రమ్ములు, టార్పలిన్ పట్టాలు పంపిణీ చేశారు.

నీటిసమస్య పరిష్కారం

జూపాడుబంగ్లా: శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి సహకారంలో పారుమంచాల గ్రామంలో రూ.1.50 లక్షలతో తాగునీటి సమస్యపరిష్కరించినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు మండడి సతీష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బోరుకు మోటారును అమర్చటంతో పాటు కొత్తగా పైపులైన్ వేసి సమస్యకు పరిష్కారం చూపామన్నారు. తూడిచెర్ల గ్రామంలోని 5, 6,7 వార్డులతో పాటు నాల్గోవవార్డులో కొంత మేర తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపీటీసీ దొడ్డా నాగమణి, వైఎస్సార్సీపీ నాయకుడు దొడ్డా సుధాకర్ తెలిపారు.

పాఠశాలకు ట్రంకు పెట్టెల వితరణ

పగిడ్యాల: నూతనంగా ఏర్పాటైన పదవ తరగతి పరీక్ష కేంద్రమైన పాతముచ్చుమర్రి జిల్లా పరిషత్ పాఠశాలకు కొత్త ముచ్చుమర్రి గ్రామ సర్పంచ్ కాటం రాధమ్మ భర్త కాటం రమేష్‌కుమార్‌రెడ్డి గురువారం 14 ట్రంకు పెట్టెలు విరాళంగా అందజేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కొత్తపల్లి: వైద్య ఆరోగ్య శాఖలో 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న వారిని క్రమబద్ధీకరించిన సందర్భంగా హెల్త్ అసిస్టెంట్లు సత్యం రెడ్డి, శాంతమ్మ మండలంలోని ఎర్రమఠం వైద్యశాలలో గురువారం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బ్యానర్‌కు పాలాభిషేకం చేశారు.

నేడు మహాశివరాత్రి వేడుకలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో నేడు మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ లింగోద్భవం సందర్భంగా శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

పాగాలంకరణ పరమేశ్వరుడి వరమే

- మూడు తరాలుగా పాగాలంకరణ సేవలో దేవాంగ కుటుంబం



పృథ్వీ వెంకటేశ్వర్లు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీశైలం మల్లన్నకు లింగోద్భవ కాంలో జరిగే పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. బ్రహ్మోత్సవ కల్యాణానికి ముందు మల్లికార్జున స్వామివారిని పాగాలంకరుడిని చేసే సంప్రదాయమిది. ఈ పాగాలంకరణ సేవను ప్రకాశం జిల్లా చీరాల వద్ద హస్తినాపురానికి చెందిన ఒకే కుటుంబం వారసత్వ ఆధారంగా నిర్వహిస్తుంది. ఏటా మహాశివరాత్రి నాడు మల్లన్నకు తలపాగా చుడుతున్న దేవాంగ భక్తుడు పృథ్వీ వెంకటేశ్వర్లు సతీసమేతంగా పాగాతో స్వామి సన్నిధికి చేరుకున్నారు. మల్లన్నకు పాగా చుట్టే పృథ్వీ వెంకటేశ్వర్లును సాక్షి పలకరించగా పలు విషయాలు పంచుకున్నారు.

మూడు తరాల నుంచి..

పృథ్వీ వెంకటేశ్వర్లు ఇంటి దైవం శ్రీశైల మల్లికార్జునస్వామి. మల్లన్న బ్రహ్మోత్సవాల్లో మహాశివరాత్రి నాడు వారు స్వయంగా నేసిన పాగాను అలంకరించేవారు. మూడు తరాల నుంచి అనవాయితీ కొనసాగుతుంది. పృథ్వీ వెంకటేశ్వర్లు 14వ ఏట నుంచి పాగా తయారు చేస్తున్నారు. వారి పూర్వీకుల నుంచి సుమారు 70 ఏళ్ల నుంచి ఈ ఆచారం కొనసాగుతుంది.

నియమ, నిష్టలతో..

మల్లికార్జున స్వామివారికి చుట్టే పాగా ఎంతో నియమ, నిష్టలు, భక్తిశ్రద్ధలతో నేస్తారు. కార్తీకమాసం ప్రారంభం నుంచి పాగా నేత ప్రారంభించి శివరాత్రికి 10 రోజుల ముందే మూర వెడల్పుతో 300 మూరలు పూర్తి చేస్తారు. మహాశివరాత్రి నాడు కుటుంబ సమేతంగా శ్రీశైలం చేరుకుని సంప్రదాయబద్ధంగా పాగాలంకరణ చేస్తారు.

దేవస్థానం సహకారం..

ఏటా మహాశివరాత్రి నాడు మల్లన్నకు తలపాగా చుట్టాలని ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని దేవస్థాన అధికారులు పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబానికి అందజేస్తారు. పాగా వస్త్రంతో రావడంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతారు. భోజనం, వసతి, ప్రత్యేక దర్శనాలతో పాటు ఆర్థిక పోత్రాహాన్ని కూడ దేవస్థాన అధికారులు అందజేస్తున్నారు.

పరమేశ్వరుడి దీవెన..

మా పూర్వీకుల నుంచి శ్రీశైల మల్లికార్జున స్వామివారికి పాగా చుట్టే ఆచారం కొనసాగుతుంది. కోట్లాది మంది భక్తులు ఇష్టదైవంగా కొలిచే స్వామివారికి పాగాలంకరణ చేయడం మేం చేసుకున్న అదృష్టం. మల్లయ్యే మాకు ఆ అదృష్టాన్ని కల్పించారు.

భక్తులకు సకల సౌకర్యాలు



వెలమ సత్రంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రంలోని పలు ప్రదేశాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అన్నదాన భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులను అడిగి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అన్నదానం భవనంలో క్యూలైన్లలో వేచిఉన్న భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజును ఆదేశించారు. అనంతరం శ్రీశైలంలోని అఖిల భారత వెలమ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

స్వయం ఉపాధిలో మహిళలు రాణించాలి

జూపాడుబంగ్లా: వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ప్రభుత్వం 45ఏళ్లు పైబడిన మహిళలకు ఇచ్చే మొత్తాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధిరంగాల్లో రాణించాలని ఏపీఎం అంబమ్మ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో వైఎస్సార్ చేయూత లాంఛింగ్ కార్యక్రమాన్ని పొదుపు మహిళలు టీవీలో వీక్షించటంతో పాటు వారికి అవగాహన కల్పించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని నాల్గొవ విడతగా 14,407మంది మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం వర్తించగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.27 కోట్ల నిధులు జమ చేసినట్లు తెలిపారు. జూపాడుబంగ్లాలో 2,481 మంది మహిళలకు రూ.4.65కోట్లు, కొత్తపల్లిలో 1,734మందికి రూ.3.25కోట్లు, మిడుతూరు 2,685 మందికి రూ.5.0కోట్లు, నందికొట్కూరు 2,630మందికి రూ.4.93కోట్లు, పగిడ్యాల 2,263మందికి రూ.4.24కోట్లు, పాములపాడు 2,614మందికి రూ.4.90కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు.

నేటి నుంచి చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలు

నందికొట్కూరు రూరల్ : మండలంలోని బిజినవేముల గ్రామంలో కొలువై ఉన్న కాశీ చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవాలను ఈ నెల 8నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తారు. మహోత్సవాలకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. ఐదు రోజుల పాటు జరిగే వేడుకల్లో రోజుకో అలంకరణతో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

నందికొట్కూరు: వేలం దారులు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో మార్కెట్ వేలాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారపు సంత రూ.7.25 లక్షలకు, దిన మార్కెట్ రూ, 4.77 లక్షలకు, బస్టాండ్ రూ.4.52 లక్షలకు, కమేళా రూ.1.09 లక్షలకు, మాంసపు మార్కెట్ రూ.1.12 లక్షలకు పలువురు దక్కించుకున్నారని చెప్పారు. మున్సిపల్ ఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్ఐ విక్రం, జీవన్ పాల్గొన్నారు.

పచ్చళ్లు అందజేత



దాతను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరుకు చెందిన విజయ ప్రొడక్షన్ అధినేత కాటూరి రాము పచ్చళ్లను గురువారం విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతుల మీదుగా దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజుకు పచ్చళ్లను అందజేశారు. మామిడి, అవకాయ, మామిడి తురుము పచ్చళ్లను 2,040 కేజీలు అందజేశామని, వీటి విలువ రూ.6,32,400 ఉంటుందని దాత తెలిపారు. అనంతరం దాతను స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

నేడు మహాలింగోద్భవం

మహానంది: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహానందిలో శుక్రవారం రాత్రి 11.30 గంటల నుంచి లింగోద్భవం వైభవంగా జరగనుంది. స్వామివారు ఉద్భవించే సమయాన శ్రీ మహానందీశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. వివిధ ఫలాల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి విశేషంగా పూజలు జరుగుతాయి. లింగోద్భవం అభిషేకం అనంతరం తెల్లవారుజామున మహానందీశ్వరుడి కల్యాణోత్సవం నిర్వహిస్తామని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. వేలాది మంది భక్తజనం రాకతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

శ్రీశైలం: శ్రీశైల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి కొన్ని సూచనలు చేశారు. వాహనదారులు తమ ఫోర్ వీలర్స్ వాహనంతో పాటు తప్పనిసరిగా డ్రైవింగ్‌పై అనుభవం గల డ్రైవర్‌ను తమ వెంట తీసుకుని వెళ్లాలి.

- ⇨ ఘాట్ రోడ్డులో వాహనాలను ఓవర్ టేక్ చేయరాదు, ట్రాఫిక్ నిభంధనలను పాటించాలి.
- ⇨ బైక్‌పై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలుపరాదు.
- ⇨ సాక్షి గణపతి వద్దకు కాలినడకన వెళ్లి దర్శనం చేసుకోవాలి
- ⇨ సరుకులు అమ్మేవాళ్లు ఘాట్ రోడ్డులో ఉండకూడదు.
- ⇨ మహాశివరాత్రి రోజు రాత్రి 9 గంటల నుంచి ఉదయం వరకు దోర్నాల నుంచి శ్రీశైలం వైపు వాహనాలు అనుమతించబడవని పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నందికొట్కూరు కోర్టులో కేక్ కట్ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని అన్నారు. గురువారం పట్టణంలోని కోర్టులో మండల లీగల్ సర్వీస్ కమిటీ హాల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో, మెప్మా కార్యాలయం, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో, కళాశాల్లో, ఆయా కార్యాలయాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మహిళలు సంబరాలు జరుపుకున్నారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ శరభయ్య, ఐసీడీఎస్ కార్యాలయ సూపర్‌వైజర్లు, మున్సిపల్ కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

పగిడ్యాల: అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానంగా సాధికారిత, ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్న మహిళలు మహారాణులని పగిడ్యాల కెనరా బ్యాంక్ మేనేజర్ కవిత అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కవితను, కొణిదేల యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ముంతాజ్, సీసీ ఉమామహేశ్వరిని సన్మానించారు. ఏపీఎం శ్రీనివాసులు, సీసీలు యాపిలయ్య, జంగిలయ్య, అధ్యక్షురాలు విజయమ్మ, కార్యదర్శి లక్ష్మీదేవి, కోశాధికారి నిర్మల పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా సిబ్బందిని సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఈపీ జెన్‌కో సీఐ రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.